నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, సోమవారం 27 మే 2024 | SANGAREDDY

ఆదివారం సిద్దిపేట జిల్లా కొమురవెల్లి పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సామగ్రి, అధికారులు, పోలీసు సిబ్బంది

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సామగ్రి, సిబ్బంది

- పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్.. పటిష్ట బందోబస్తు

చేర్యాల, మే 26: వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఉప ఎన్నిక నిర్వహణకు ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. సోమవారం ఉదయం 8 నుంచి 4గంటల వరకు పోలింగ్ జరగనున్నది. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల స్టేషనరీ ఆర్టీసీ బస్సుల్లో ఆదివారం చేరాయి. చేర్యాల సీఐ శ్రీను ఆధ్వర్యంలో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల ఎస్సైల ఆధ్వర్యంలో సెక్టోరియల్ అధికారులు పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని చేర్చారు.చేర్యాల సబ్ డివిజన్ పరిధిలో 5 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రానికి మైక్రో అబ్జర్వర్, సెక్టోరియల్ అధికారితో పాటు పీవో, ఏపీవో, ఓపీవోలు, పోలీస్ సిబ్బందిని కేటాయించారు. చేర్యాల పోలింగ్ కేంద్రం(1)లో 1258, పోలింగ్ కేంద్రం(2)లో 1297, కొమురవెల్లి పోలింగ్ కేంద్రంలో 680, మద్దూరు పోలింగ్ కేంద్రంలో 936, ధూళిమిట్ట పోలింగ్ కేంద్రం లో 511 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. చేర్యాల, కొమురవెల్లి పోలింగ్ కేంద్రాలకు చేర్యాల ఎంపీడీవో మహబూబ్అలీ, మద్దూరు, ధూళిమిట్ట పోలింగ్ కేంద్రాలకు ఎంపీడీవో రామ్మోహన్ సెక్టోరియల్ అధికారులుగా విధులు నిర్వహిస్తున్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. ఓటర్లు, రాజకీయ పార్టీలు ప్రశాంత వాతావరణంలో ఎన్నిక జరిగేలా సహకరించాలని సీఐ శ్రీను, ఎస్సై దామోదర్ కోరారు.

ఆదివారం సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట పోలింగ్ కేంద్రానికి చేరుకున్న పోలింగ్ అధికారులు, పోలీసులు, సిబ్బంది

సెమీ ఫైనల్స్‌కు మెదక్ జట్టు

- మెదక్, కరీంనగర్ జట్ల మధ్య మ్యాచ్ టై
- ఈనెల 28న ఖమ్మంతో సెమీ ఫైనల్స్

సంగారెడ్డి కలెక్టరేట్, మే 26: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ క్రికెట్ మైదానంలో జరుగుతున్న టీ-20 అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు సెమీఫైనల్స్‌కు అర్హత సాధించింది. ఆదివారం కరీంనగర్, మెదక్ జట్ల మధ్య జరిగిన పోటీల్లో సమాన స్కోర్‌తో టైగా నిలిచింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన మెదక్ జిల్లా జట్టు నిర్ధారిత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 166 పరుగులు చేసింది. ఇందులో సందీప్‌రాజ్ 63, సాయినాథ్ 52 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన కరీంనగర్ జట్టు 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 166 పరుగులు చేసింది. రెండు జట్ల మధ్య స్కోర్ సమానం కావడంతో మ్యాచ్ టైగా నిలిచింది. కరీంనగర్ బ్యాటింగ్‌లో సూర్య 76 పరుగులు చేశాడు. మెదక్ జట్టు బౌలింగ్‌లో వేదాంత్ 3 వికెట్లు తీశాడు. ఈనెల 24న ప్రారంభమైన టోర్నీలో మొదటి మ్యాచ్‌లో ఆదిలాబాద్ జట్టుపై మెదక్ జిల్లా జట్టు విజయం సాధించగా, 25న వరంగల్ జట్టుపై కూడా 55 పరుగులతో విజయం సాధించింది. దీంతో సెమీఫైనల్స్‌లోకి చేరిన మెదక్ జట్టు ఈనెల 28న మంగళవారం ఖమ్మం జట్టు మధ్య సెమీ ఫైనల్స్ పోటీ జరగనున్నదని మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి తెలిపారు.

పత్తి రైతుకు విత్తన భారం

- గతేడాది ప్యాకెట్ ధర రూ. 853
- ప్రస్తుతం ప్యాకెట్ ధర రూ. 864
- ఈ ఏడాది సంగారెడ్డి జిల్లాలో 3.60లక్షల ఎకరాల్లో సాగు చేసే అవకాశం
- రైతులపై రూ. కోటి అదనపు భారం
- నకిలీ విత్తనాలపై అప్రమత్తత అవసరం

పెరిగిన పత్తి విత్తనాల ధరలు.. ప్రతి ప్యాకెట్‌పై రూ. 11 పెంపు

ఏడాది	ధర...
2019	రూ. 710
2020	రూ. 730
2021	రూ. 767
2022	రూ. 810
2023	రూ. 853
2024	రూ. 864

సదాశివపేట, మే 26: అన్నదాత కష్టం అంతా ఇంతాకాదు. ఆరుగాలం కష్టపడి పండిస్తే మిగిలేది అంతంతమాత్రమే. ప్రారంభంలో నకిలీ విత్తనాల బెడద, పంట పెరుగుతున్న క్రమంలో చీడపురుగుల బాధ.. అందులో అకాల వర్షాలు వస్తే అంతే సంగతి. రూ. లక్షల్లో పెట్టుబడి పెట్టి సాగుచేసినా ఒక్కోసారి పంట వర్షార్పణం కాక తప్పదు. పండిన పంట కాస్త గిట్టుబాటు ధర లేక..దళారుల మోసాలు ఇలా అన్నీ రైతులకు కష్టాలే. దీనికి తోడు ఈ ఏడాది పత్తి విత్తన కంపెనీలు ధరలు పెంచాయి. ప్యాకెట్‌పై రూ. 11 పెంచడంతో సంగారెడ్డి జిల్లాలో రైతులపై కోటి రూపాయలకు పైగా అదనపు భారం పడనున్నది. సంగారెడ్డి జిల్లాలో 3.60లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగుకానున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ధరలు పెంచడంతో అక్రమార్కులు నకిలీ విత్తనాలను అంటగట్టే ప్రయత్నం చేయవచ్చు. రైతన్న తస్మాత్ జాగ్రత్త. రైతు సంక్షేమమే తమ సంక్షేమం అంటూ పాలకులు నిత్యం ఊకదంపుడు ఉపన్యాసాలు దంచేస్తుంటారు. కానీ,ఆచరణకు వచ్చే సరికి పంట ఉత్పత్తుల ధర పెరగదు. కానీ, విత్తనాల ధర ఏటా పెంచుతూ రైతుల నెత్తిన గుదిబండను వేస్తున్నారు. ఏటా పత్తి విత్తన ప్యాకెట్‌పై ధరలు పెరగడమే దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు.

సంగారెడ్డి జిల్లాలో ఈ ఏడాది పంటల సాగుకు అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. అందులో భాగంగా పత్తి పంట 3.60లక్షల ఎకరాల్లో సాగు చేయాలని అధికారులు అంచనా వేశారు. పత్తి సాగు కోసం మొత్తంగా సుమారు 10లక్షల విత్తన ప్యాకెట్లు అవసరం ఉంటుంది. గతేడాది ప్రతి ప్యాకెట్‌పై రూ. 853 ధర ఉండేది. ప్రస్తుతం ఆ ప్యాకెట్ ధరను రూ. 864కు పెంచుతూ విత్తన కంపెనీ యాజమాన్యాలు నిర్ణయం తీసుకున్నాయి.

ఏటా పెరుగుతున్న పత్తి విత్తనాల ధర..

కాలంతో సంబంధం లేకుండా ఏటా పత్తి విత్తనాల కంపెనీలు విత్తన ప్యాకెట్ల ధరలను పెంచుతూ రైతులపై మరింత భారాన్ని మోపుతున్నాయి. ఎనిమిదేండ్లుగా కంపెనీలు రైతు నెత్తిన ధరల పేరుతో గుదిబండను మోపుతున్నాయి. ఒక పత్తి ప్యాకెట్‌పై రూ. 11 ఈ సీజన్‌లో అదనంగా పెరిగింది. ప్రస్తుత సాగు లెక్కల ప్రకారం ప్రతి ఎకరాకు 2 నుంచి 3 పత్తి ప్యాకెట్లు అవసరం ఉంటాయి. ఆ లెక్కల ప్రకారం 10 లక్షల విత్తన ప్యాకెట్లు అవసరం ఉన్నాయి. దీంతో రూ. కోటికి పైగా ఆర్థిక భారం రైతులపై పడనున్నది. ఇప్పటికే గతేడాది పంటల దిగుబడి సరిగ్గా లేక రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయిన విషయం అందరికీ తెలిసిందే. విత్తన ధర పెంపుతో మరింత ఆర్థిక భారం పడిందని చెప్పవచ్చు.

రైతుల అప్రమత్తత అవసరం..

సీజన్ ముంచుకొస్తున్న వేళ విత్తనాల కొనుగోలులో రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. పెరిగిన ధరలను ఆసరాగా చేసుకుని నకిలీ విత్తన కంపెనీలు తక్కువ ధర పేరుతో మారుమూల పల్లెల్లోకి విత్తనాలు తీసుకొచ్చి విక్రయిస్తుంటాయి. నాణ్యత లేని విత్తనాలు లేదా గుర్తింపు కంపెనీల నుంచి తయారు చేసిన విత్తనాలను కొనుగోలు చేస్తే నష్టపోవాల్సి వస్తుంది. రైతులు జాగత్రగా ఉండాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఎక్కువగా పత్తి విత్తనాలే నకిలీవి అమ్ముతుంటారు. గతేడాది సదాశివపేట మండలం ఆత్మకూర్‌లో నకిలీ విత్తనాలు తయారు చేస్తున్న కేంద్రాలపై దాడులు చేసి వాటిని ధ్వంసం చేశారు. నకిలీ విత్తనాలు అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి చర్యలు తీసుకున్నారు. అందుకే విత్తనాలు కొనుగోలు చేసే ప్రతి రైతు సంబంధిత షాప్ నుంచి బిల్లు తప్పకుండా తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఇటీవల సిద్దిపేట జిల్లా మహ్మదాపూర్‌లో పోలీసులు పట్టుకున్న నకిలీ విత్తనాల బస్తాలు

తిమ్మక్కపల్లి వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

మూల మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు

- సూచిక బోర్డులు కరువు
- ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

రాయపోల్, మే 26: సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలో పలుచోట్ల మూల మలుపులతో రోడ్లపై ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మండల కేంద్రం రాయపోల్ శివారులో నిత్యం మూల మలుపు వద్ద కనీసం ప్రమాద సూచిక బోర్డులు లేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ రోడ్డుపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. అదే రోడ్డుపై మూల మలుపు వద్ద వైన్స్ ఏర్పాటు చేయడంతో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రతిరోజు వైన్స్ ముందు రోడ్డు రద్దీగా ఉంటుండడంతో మూలమలుపు నుంచి వచ్చే వాహనాలతో ఎప్పుడూ ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. ఇటీవల రోడ్డు పక్కనే పైపులైన్ల తవ్వకాలు చేపట్టారు. పనులు తొందరగా జరగక పోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయపోల్ సమీపంలోని తిమ్మక్కపల్లి వద్ద సైతం మూల మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ మూల మలుపు వద్ద వైన్స్ ఉండడంతో అక్కడ నిత్యం జనం రద్దీగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి సూచిక బోర్డులతో పాటు స్టాపర్లను ఏర్పాటు చేయించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

రాయపోల్ వద్ద ప్రమాదకరంగా మూలమలుపు

కలెక్టరేట్ నుంచి తరలిన సామగ్రి

సిద్దిపేట కలెక్టరేట్ నుంచి పోలింగ్ సామగ్రిని తరలిస్తున్న సిబ్బంది

సిద్దిపేట అర్బన్, మే 26: నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ కోసం జిల్లాలోని కొమురవెల్లి, చేర్యాల, ధూళిమిట్ట, మద్దూర్ మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు సిద్దిపేట కలెక్టరేట్‌లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఆదివారం పోలింగ్ సామగ్రిని తరలించారు. పోలింగ్ సిబ్బంది పోలీస్ ఎస్కార్ట్‌తో ఆర్టీసీ బస్సుల్లో పోలింగ్ సామగ్రిని తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పోలింగ్ సామగ్రితో సిబ్బంది కేంద్రాలకు చేరుకున్నట్లు తెలిపారు. ఉప ఎన్నిక ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ పోలింగ్‌లో ఆరుగురు ప్రిసైడింగ్ అధికారులు, ఆరుగురు అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఆరుగురు ఇతర పోలింగ్ అధికారులు, 12 మంది మైక్రో అబ్జర్వర్లు విధుల్లో పాల్గొంటారని తెలిపారు. చేర్యాల మండల కేంద్రంలో రెండు పోలింగ్ బూత్‌లు, కొమురవెల్లి, ధూళిమిట్ట, మద్దూర్‌లో ఒక్కో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ కొనసాగుతుందని, ఈ 4 మండలాల్లో మొత్తం 4,659 మంది పట్టభద్ర ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఆయన వెంట కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్, ఇతర అధికారులు ఉన్నారు.

నల్ల పోచమ్మకు బోనాలు

- ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రావు

ఆదివారం రాత్రి మెదక్ పట్టణంలో అమ్మవారికి ఊరేగింపుగా తీసుకువెళ్తున్న బోనాలు

మెదక్ మున్సిపాలిటీ, మే 26: పోతరాజుల విన్యాసాలు, యువకుల కేరింతలు, మహిళల పూనకాలు, బ్యాండ్‌మేళాల మధ్య మెదక్ పట్టణంలో ఆదివారం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో నల్లపోచమ్మకు బోనాలు తీశారు. ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. సాయంత్రం పట్టణంలోని ఆయా వీధుల్లో గల మున్నూరుకాపు మహిళలు బోనాలను ఎత్తుకుని రాందాస్ చౌరస్తాకు చేరుకున్నారు. అక్కడి నుంచి పాత బస్టాండ్, గోల్కొండ వీధుల మీదుగా బోనాల శోభాయాత్ర కొనసాగి ఆటోనగర్‌లోని నల్ల పోచమ్మ దేవాలయానికి చేరుకుని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర నాయకులతో పాటు జిల్లా అధ్యక్షుడు బట్టి ఉదయ్, పట్టణ అధ్యక్షుడు గట్టేశ్, మున్సిపల్ కౌన్సిలర్లు, శేఖర్, సుమన్, సంఘం నాయకులు అశోక్, సుమన్, నిఖిల్, భూషణం, కామాటి కృష్ణ, మల్లేశం, చంద్రశేఖర్, విజయ్, మహిపాల్, ప్రసాద్, బాలరామ్, వంశీ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పూల మల్లేశం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర నాయకులను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. పట్టణ సీఐ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

శేరి సుభాష్‌రెడ్డిని శాలువాతో సన్మానిస్తున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

సంగారెడ్డి జిల్లా గొల్లపల్లి శివారులో హరితహారం చెట్లను నరికివేసిన దృశ్యం

హరితహారంపై గొడ్డలివేటు

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటి సంరక్షించింది. అప్పట్లో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి నీడను, గాలిని ఇస్తున్నాయి. మొక్కలతో రోడ్లకు ఇరువైపులా ఆహ్లాదకర వాతావరణం ఏర్పడింది. కాగా, విద్యుత్ శాఖ సిబ్బంది కరెంట్ లైన్లకు అడ్డుగా వస్తున్నాయని ఇష్టారాజ్యంగా హరితహారం చెట్లను నరికివేస్తున్నారు. కొమ్మలు నరకాల్సి ఉండగా, చాలాచోట్ల చెట్లనే నరికివేస్తున్నారు. దీంతో పర్యావరణ పరిరక్షణ లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గొల్లపల్లి శివారులో ఆదివారం హరితహారం చెట్లను నరికివేశారు. దీంతో ప్రకృతి ప్రేమికులు విద్యుత్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా చెట్లు నరికిన విద్యుత్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

– సంగారెడ్డి ఫొటోగ్రాఫర్, మే 26

సంగారెడ్డి జిల్లా గొల్లపల్లి శివారులో హరితహారం చెట్లను నరికివేసిన దృశ్యం

చిల్డ్రన్ పార్కుకు తాళం

పూర్తయి ఏడాదైనా ప్రారంభించేదెప్పుడో..?

- రూ. 1.50 కోట్లతో సుందరీకరణ
- పట్టించుకోని అధికారులు
- సదాశివపేట వాసులకు ఆహ్లాదం కరువు

సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలోని చిల్డ్రన్ పార్కుకు తాళం వేసిన దృశ్యం

సదాశివపేట, మే 26: చిన్నలు, పెద్దలు సేద తీరేందుకు సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో నిర్మించిన చిల్డ్రన్ పార్కుకు తాళం పడింది. నిర్మాణం పూర్తయి ఏడాదైనా పార్కుకు తాళం తీయడం లేదు. వేసవి ముగుస్తున్నా పార్కును ప్రారంభించక పోవడంతో పట్టణ వాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్కును ఎప్పుడు ప్రారంభిస్తారో అని ఎదురుచూస్తున్నారు. నిత్యం బిజీగా ఉండే సదాశివపేట ప్రజలు సేదతీరేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1.50 కోట్లతో చిల్డ్రన్ పార్కును 10వ వార్డులో ఏర్పాటు చేసింది. అందరూ సేద తీరేందుకు చూడచక్కని రీతిలో పార్కు రూపుదిద్దుకున్నది. పార్కులో ఏర్పాటు చేసిన వివిధ ఆకృతులు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునేందుకు అధునాతన ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. పండ్లు, ఫలాలు, జంతువులు, కూరగాయలు తదితర ఆకృతులు అందరినీ ఆకట్టుకునే విధంగా నిర్మించారు. హైదరాబాద్‌లోని పార్కులను తలపించేలా చిల్డ్రన్ పార్కు ఏర్పాటు చేశారు. అధునాతన హంగులతో పార్కులో అన్ని ఏర్పాట్లు చేయడంతో రాబోయే రోజుల్లో చిల్డ్రన్ పార్కు పిక్నిక్ స్పాట్‌గా మారే అవకాశం ఉంది. కానీ, అధికారుల నిర్లక్ష్యంతో పార్కు ఇంకా అందుబాటులోకి రావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చిల్డ్రన్ పార్కును అందుబాటులోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సదాశివపేటలోని చిల్డ్రన్ పార్కులో ఏర్పాటు చేసిన వివిధ ఆకృతులు